

దీక్షా దివస్ ర్యాలీలో ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీ తీసుకుంటున్న బాలిక


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 30 నవంబర్ 2024 | HYDERABAD




మేడ్చల్‌లో దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు




తెలంగాణ భవన్‌లో జరిగిన దీక్షా దివస్‌లో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, తలసాని, పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీలు కవిత, మహమూద్ అలీ, మధుసూదనచారి

# కేసీఆర్ పేరును చెరిపేయలేరు

**ఉద్యమ చరిత్రను దీక్షతో మలుపు తిప్పిన ఘనత కేసీఆర్‌ది**

**పోరాట, పరిపాలన పటిమ బీఆర్ఎస్ సొంతం**

**దీక్షా దివస్‌లో గ్రేటర్ బీఆర్ఎస్ నేతలు**

**బైక్ ర్యాలీలు, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తిన భాగ్యనగరం**

**తెలంగాణభవన్‌కు పాదయాత్ర సమయంలో అధికారుల ఆటంకాలు**

సిటీబ్యూరో, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): 'ఉద్యమ చరిత్రను దీక్షతో మలుపు తిప్పిన ఘనత కేసీఆర్‌ది. పోరాట, పరిపాలన పటిమ బీఆర్ఎస్ పార్టీ సొంతం' అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ పేరును చెరిపివేయడం సీఎం రేవంత్‌రెడ్డి తరం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని ఈ సందర్భంగా తలసాని అన్నారు. 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని తలసాని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్ల కల తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి కేసీఆర్ చరిత్రలో గొప్ప నేతగా నిలిచారన్నారు. శుక్రవారం బేగంపేటలోని పాటిగడ్డలో తెలంగాణ భవన్ వరకు సాగిన భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. పాటిగడ్డ నుంచి తెలంగాణ భవన్ సమీపంలోని బసవతారకం క్యాన్సర్ దవాఖాన వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర తలసాని బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. ఆ తర్వాత బంజారాహిల్స్ క్యాన్సర్ హాస్పిటల్ నుంచి తెలంగాణ భవన్‌కు పాదయాత్రగా ర్యాలీగా వెళ్లారు. నగర నలుమూలల నుంచి తరలివచ్చిన గులాబీ శ్రేణులతో దీక్షా దివస్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు మంత్రి పదవి ఇస్తానని అప్పటి ప్రభుత్వం మభ్యపెట్టాలని చూసినా, పదవి తనకు వద్దని తెలంగాణ రాష్ట్రం కావాలని అడిగి గొంతెత్తిన ఉద్యమ నేత కేసీఆర్ అని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ పేరు నిలిచి ఉంటుందన్నారు. ఈ రోజు రాష్ట్రం బాగుపడిందంటే కేసీఆర్ పుణ్యమేనని చెప్పారు.

### దీక్షా దివస్‌కు ఆటంకాలు

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రేటర్‌లో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకలకు అధికారులు అడుగడుగునా అటంకాలు కల్పించారు. వేడుకల కోసం తాజ్‌కృష్ణ, బంజారాహిల్స్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నేతలు గులాబీ జెండాలు, తోరణాలు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయగా.. వాటిని తొలగించారు. తెలంగాణ భవన్ నుంచి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు పాదయాత్రగా వెళ్తున్న సమయంలో అధికారులు వీధి దీపాలను ఆర్పి వేశారు. చీకట్లోనే పాదయాత్రగా భవన్‌కు నడుచుకుంటూ వెళ్లారు. ఉద్యమ కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలను ఈ సందర్భంగా గులాబీ శ్రేణులు గుర్తు చేసుకున్నారు.

## తెలంగాణలో మళ్లీ కుట్రలకు ప్రయత్నం

**దీక్షా దివస్‌లో శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్**

మేడ్చల్: తెలంగాణపై కుట్రల ప్రయత్నాలు జరుగతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చక హైదరాబాద్‌లో పచ్చ జెండాల ఊరేగింపు జరిగిందని శాసన మండలి మాజీ చైర్మన్, మేడ్చల్ జిల్లా దీక్షా దివస్ ఇన్‌చార్జి స్వామిగౌడ్ అన్నారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ సమీపంలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్వామిగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ తన ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ సాధించారని, అలాంటి తెలంగాణలో మళ్లీ కుట్రలకు తెరలేపుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దరిద్రపు గొట్టు కాంగ్రెస్ ప్రభుత్వం

**-మాజీ మంత్రి మల్లారెడ్డి**

దరిద్రపు గొట్టు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ఎగ్గోడుతున్నది. తెలంగాణ సాధించిన కేసీఆర్ పదేండ్ల కాలంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలిపారు. ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు ప్రజల తరపున పోరాడుదాం.

### పోరాటం చేద్దాం

**-కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు పోరాటం చేద్దాం.తెలంగాణలో మళ్లీ ఉద్యమం చేయాల్సిన అవసరం వచ్చింది. కేసీఆర్ పాలనలో పదేండ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని ఇప్పుడు ప్రజలందరూ గుర్తు చేసుకుంటున్నారు.

### ఎన్నికలు ఎప్పడొచ్చినా.. బీఆర్ఎస్‌దే అధికారం

**-కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

ఎప్పుడు ఎన్నికలొచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. పదేండ్ల కాలంలో కేసీఆర్ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి లూటీ చేస్తున్నది. దొంగ వాగ్ధానాలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రజలకు అందే వరకు పోరాటాలు చేద్దాం.

### కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు విశ్రమించా

**-మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు విశ్రమించేది లేదు. చావును సైతం లెక్క చేయకుండా తెలంగాణ తెచ్చిన కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా ఉండాలో అ విధంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.

### డిపాజిట్లు దక్కవని సర్వేలు తేల్చాయి

**- ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు**

బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఎప్పుడు ఎన్నికలు జరిగినా డిపాజిట్లు దక్కవని పలు సర్వేలు తేల్చాయి. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని ప్రజలే స్వయంగా అంటున్నారు.



శంషాబాద్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తదితరులు

## కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం

**దీక్షా దివస్‌లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ**

శంషాబాద్ రూరల్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం స్పందించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రకటన చేసిందని మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ గుర్తు చేశారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. కేవలం అధికార దాహంతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్న ఏడాదిలోనే రాష్ట్రం అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

### కేసీఆర్ దీక్షతోనే దిగివచ్చిన కేంద్రం

**-ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేక రకాలుగా ఉద్యమాలు చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ. గెజిట్ విడుదల చేసింది.



దీక్షా దివస్‌ను పురస్కరించుకొని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ రాంనగర్ చౌరస్తాలోని అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌కు ర్యాలీని ప్రారంభించారు.



బేగంపేట పాటిగడ్డ నుంచి తెలంగాణ భవన్ వరకు సాగిన భారీ బైక్ ర్యాలీని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. సుమారు 3 వేల మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 5 కిలో మీటర్ల దూరం వరకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు.



దీక్షా దివస్ సందర్భంగా నిమ్స్ దవాఖానలోని ఓపీ, ఆంకాలజీ, మిలీనియమ్, ఎమర్జెన్సీ వార్డుల్లో రోగులకు ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, బీఆర్ఎస్ నాయకులు విప్లవ్ కుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి పండ్లు పంపిణీ చేశారు.



### దీక్షతోనే కల సాకారం

**సిటీబ్యూరో: కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని తెలంగాణ బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన దీక్షా దివస్‌లో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ.. ప్రాణాలకు తెగించి కేసీఆర్ దీక్ష చేపట్టి రాష్ట్ర కలను సాకారం చేశారని చెప్పారు.**

దీక్షా దివస్ సందర్భంగా కంటోన్మెంట్ అంబేద్కర్ హాట్స్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్



### సోషల్ మీడియాలో గులాబీ సందడి

సోషల్ మీడియా అంతా 'దీక్షా దివస్'తో నిండిపోయింది. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ కల సాకారమైందని నెటిజన్లు పోస్టుల్లో ప్రశంసల వర్షం కురిపించారు. నగరమంతా ర్యాలీలు, జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాల హ్యాష్ ట్యాగ్‌లు ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్‌లలో నిండిపోయాయి. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదనీ రవి అనే నెటిజన్ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. కేసీఆర్ దీక్షకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అందరూ వాట్సాప్ స్టేటస్‌లు, డీపీలుగా పెట్టుకున్నారు. ప్రతి ఒక్కరూ దీక్ష దివస్ ర్యాలీలో పాల్గొని సంబంధిత ఫొటోలను సోషల్ మీడియాలో జై కేసీఆర్ హ్యాష్ ట్యాగ్‌తో షేర్ చేశారు.

# చెరువుల లెక్క తేలేనా..!

## 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయంటున్న హైడ్రా

**ఉన్నవాటికి హద్దుల నిర్ధారణలోనూ అయోమయం.. క్షేత్రస్థాయి విచారణలో ఆసక్తికర అంశాలు**



సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో ఒకప్పుడు ఉన్న చెరువుల్లో ఇప్పుడు 61 శాతం లేకుండా పోయాయని హైడ్రా అంటోంది. మిగతా 39 శాతం చెరువుల లెక్క తేల్చడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని హైడ్రా అంటున్నది. ఇన్నర్ ఓఆర్ఆర్ హైడ్రా పరిధిలోకి వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న చెరువుల పరిరక్షణకు హైడ్రా పనిచేస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలపై హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ పరిస్థితులను హైడ్రా సమీక్షిస్తోంది. ఇందులో అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ముఖ్యంగా చెరువుల చుట్టుపక్కల ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేస్తున్నప్పుడు స్థానికులు, అధికారుల నుంచి వస్తున్న అభిప్రాయాలపై హైడ్రా చర్చ జరుపుతున్నది. ప్రధానంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో ప్రస్తుతం కుంట, చెరువు కనిపించకపోయినప్పటికీ రికార్డుల్లో మాత్రం ఉంటున్నాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు. ఇక సర్వే నంబర్ల మార్పులు, కొన్ని తేడాల వల్ల జల వనరులే లేకుండా పోయాయని, వీటిలో అవకాశమున్న కొన్ని జలవనరులను పునరుద్ధరించే పరిస్థితులపై కూడా ఇరిగేషన్ నిపుణులతో చర్చిస్తున్నారు. ఎక్కడెక్కడ చెరువులు మాయమయ్యాయో తెలుసుకుని వాటి ప్రస్తుత స్థితిగతులను ప్రభుత్వానికి నివేదికగా ఇస్తామని వారు చెబుతున్నారు. మరోవైపు చెరువుల హద్దుల నిర్ధారణపై కూడా హైడ్రాలో అయోమయం నెలకొంది. ఇప్పటివరకు ఓఆర్ఆర్ పరిధిలో ఏ చెరువుకు కూడా నిర్దిష్టంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల నిర్ధారణ విషయంలో స్పష్టత లేకపోవడంతో తమ కార్యాచరణ ఎలా కొనసాగించాలో తెలియక హైడ్రా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. హద్దుల నిర్ధారణ విషయంలో అటు హెచ్‌ఎండీఏ, ఇటు బల్దియా మరోవైపు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఒక ప్రణాళికతో ముందుకుపోకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తుతున్నదని హైడ్రాలో చర్చ జరుగుతోంది.

### అంశాల వారీగా .. బృందాలుగా విచారణ..

హైడ్రా కార్యాలయానికి జలవనరుల విషయంలో ఫిర్యాదులొస్తున్నాయి. సుమారుగా నాలుగువేలకు పైగా ఫిర్యాదులొచ్చాయని హైడ్రా చెబుతున్నది. ఇందులో కొన్ని కుంటలు, చెరువులు మాయమైనవాటిపై ఉన్న ఫిర్యాదులుండగా మరికొన్ని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలపైనే ఉన్నాయి. మరికొన్ని ప్రభుత్వ స్థలాలు, పార్కులు, నాలాల ఆక్రమణలపై ఉన్నాయి. అయితే ఫిర్యాదులను అంశాల వారీగా వేరు చేసి బృందాలుగా విచారణ చేస్తున్నారు. ఇందులో మాయమైన చెరువులు, కుంటల ఫిర్యాదులపై వెళ్లినప్పుడు పరిస్థితులు నివేదిక రూపంలో తయారు చేశారు. ప్రస్తుతం ఉన్న వాటి లెక్క తేల్చడం కొంత కష్టమవుతున్నప్పటికీ.. ఉన్న వాటిని పరిరక్షించాలనే పనిచేస్తున్నామని హైడ్రా చెబుతోంది.

### హద్దుల నిర్ధారణలో అయోమయం..

హైడ్రా పరిధిలో ఉన్న చెరువుల లెక్క తేల్చే సమయంలో అసలు ఎన్ని చెరువులున్నాయి.. వాటికి ఉన్న హద్దులపై అధికారులు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా హైడ్రా ఇటీవల నిర్వహించిన సదస్సులో ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. హైడ్రా రిటైర్డ్ ఇంజినీర్లతో చెరువుల హద్దుల్లో వస్తున్న తేడాలపై చర్చించింది. ఉదాహరణకు అమీన్‌పూర్ చెరువు విస్తీర్ణం 1949 కెడస్ట్రియల్ మ్యాప్ ప్రకారం 96.8 ఎకరాలు కాగా చెరువు చరిత్ర(మెమొయిర్స్) ప్రకారం 93.37 ఎకరాలు.. సర్వే ఆఫ్ ఇండియా టోపో షీట్ 2005 ఆధారంగా 132.97 ఎకరాలు. 2001 లో చెరువులో నిలిచిన నీటి విస్తీర్ణం 103 ఎకరాలు.. హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల సర్వే ప్రకారం 464 ఎకరాలు..ఒక్క అమీన్‌పూర్ మాత్రమే కాకుండా ఓఆర్ఆర్ లోపల ఉన్న మేజర్ చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం విస్తీర్ణం, బఫర్ జోన్‌కు సంబంధించిన వివరాలు ఒక్కో విభాగం రికార్డుల్లో ఒక్కోలా ఉన్నాయి. ఇది చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమీన్‌పూర్ చెరువు విస్తీర్ణం 464 ఎకరాలుగా హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ విభాగాలు నిర్ణయించగా.. స్థానికులు కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం చెరువులో 400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నీళ్లు ఉన్నాయి. ఒక్క అమీన్‌పూర్ చెరువే కాకుండా చాలా చెరువుల పరిస్థితి వేర్వేరుగా ఉందని, ప్రతీ చెరువుకు చరిత్ర ఎంత ఉందో అంతే స్థాయిలో సమస్యలు ఉన్నాయని సమీక్షలో హైడ్రా అధికారులు అన్నట్లు తెలిసింది. చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో సమగ్రమైన విధానాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని హైడ్రా బృందం భావిస్తోంది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు మైనర్ ఇరిగేషన్ సీఈ 2013లో రూపొందించిన మార్గదర్శకాల ఆధారంగా ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతోంది. రికార్డుల్లో ఉన్న వివరాలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారించాల్సి వస్తోంది. దీంతో న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణలోఅలుగు ఎంత కీలకమో, చెరువుల ఆకృతి (కాంటూరు)కూడా అంతే కీలకమని, వ్యర్థాలు, మట్టితో చెరువును నింపితే కాంటూరు మారి ఎఫ్‌టీఎల్ మారుతుందని ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు.